క్లుప్తంగా

సేఫ్టీ మోకులపై గీతకార్మికులకు శిక్షణ



దేవరుప్పుల: మండలంలోని రంబోజీగూడెం తాటివనంలో కాటమయ్య రక్షణ కవచం అనే పిలుపుతో సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు గ్రామాల గీత కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబిరం జిల్లా కో–ఆర్డినేటర్ వెంకట మల్లయ్య, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ మాట్లాడుతూ ఆరు మండలాల్లో వారం రోజుల నుంచి 335 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో శిక్షణ రిసోర్స్ పర్సన్‌లు గూడ రవీందర్, మొలుగూరి సంతోష్ కుమార్, పోతుల అంజయ్య, బాల్నే కార్తీక్, కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు ఉప్పునూతల అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నీటిని విడుదల చేయాలని వినతి

జనగామ: బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి నీటిని విడుదల చేయాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు శివరాత్రి కుమార్ వినతి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో సాగు కష్టాలు తప్పడం లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ఇరిగేషన్ ఈఈకి ఫోన్ చేసి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు.

విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలి

దేవరుప్పుల: విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిచాలని ఎంఈఓ కళావతి అన్నారు. చిన్నమడూర్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడారు. కార్యక్రమంలో పీటీలు, పీడీలు ప్రణయ్‌కుమార్, పాండ్య, యాదగిరి,కిరణ్,రవికుమార్, ఆర్‌సత్యనారాయణ, శ్రీసాయి,ప్రశాంతి, విద్యానికేతన్ కరస్పాండెంట్ పాండు కృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ఐ బాల బాలికల మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎండీ పర్వేజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రీడా కన్వీనర్ అకుల సాయికుమార్, వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


జనగామ రూరల్: అక్టోబర్ 1న కార్మికోద్యమ నేత బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సంస్మరణ సభ కరపత్రాలు ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, యాదగిరి, జోగు ప్రకాష్, చందు, షబానా, శ్రావన్, కళ్యాణి, సురేష్, శ్రీకాంత్, శ్రీలత పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



రఘునాథపల్లి: మండలంలోని సోమయ్యకుంటతండా శివారు నక్కపొక్కల తండా శివారులో రైతు సేనావత్ భాస్కర్‌కు చెందిన రూ. 70 వేల విలువైన పాడి ఆవు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలిలో మృతి చెందిన ఆవు వద్ద బాధిత రైతులు రోధించారు. విద్యుత్ అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

బతుకమ్మకుంటకు చేరిన జిమ్ పరికరాలు



జనగామ: జనగామ ఐకాన్ బతుకమ్మకుంటకు శనివారం రాత్రి జిమ్ యంత్ర పరికరాలు చేరుకున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కుంటను ఆకస్మికంతగా తనిఖీ చేసి జిమ్ పరికరాలను త్వరగా తెప్పించాలని కమీషనర్‌ను ఆదేశించారు. ఈ మేరకు జిమ్ పరికరాలు రాగా, రెండు రోజుల్లో బిగించి, వాకర్లకు అందుబాటులోకి తీసుకు రానున్నారు.

పాఠశాలలో గదుల కొరత

- ప్రైవేట్ భవనంలో తరగతులు
- రూ.9.60 లక్షల ఎస్‌డీఎఫ్ నిధుల పనులెప్పుడో..?



కురుమ సంఘం భవనంలో నిర్వహిస్తున్న తరగతులు

లింగాలఘణపురం: మండలంలోని చీటూరు ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరతతో కురుమ సంఘం ప్రైవేట్ భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి. 52 మంది విద్యార్థులున్న ఐదు తరగతులకు కేవలం రెండే భవనాలు ఉన్నాయి. గతంలో శిథిలావస్థలో ఉన్న మూడు తరగతి గదులను కూల్చివేయడంతో ఉన్న రెండు గదులలోనే స్టాఫ్ రూమ్, తరగతి గదులుగా వినియోగించుకున్నారు. మరో రెండు తరగతులను కురుమ సంఘం భవనంలో కొనసాగిస్తున్నారు. ముగ్గురు మహిళ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో మరుగుదొడ్లు కూడా లేవు. ఇలాంటి పాఠశాలకు నియోజకవర్గ ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులు రూ.9.60 లక్షలు మంజూరు చేశారు. వీటితో రెండు తరగతి గదుల మరమ్మతులు, కిచెన్‌షెడ్, మరుగుదొడ్ల మరమ్మతులు, వాషింగ్ ప్లాట్ ఫాంలను ఏర్పాటు చేయాలని నిధులు మంజూరు చేసి ఆరు నెలలు గడుస్తున్నా పనులు మాత్రం చేపట్టడంలేదు. కనీసం కిచెన్ షెడ్ నిర్మాణం చేపట్టినా అందులోనైనా తరగతి గదులు నిర్వహించుకొనేందుకు వీలు ఉంటుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాఠశాలను సందర్శించిన సమయంలో సమస్యను తెలియజేయగా అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. ఏదిఏమైనా మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధుల పనులైనా మొదలు పెడితే బాగుంటుందని గ్రామస్తులంటున్నారు.

ప్రమాణం చేస్తా..ఆరోపణలు నిరూపిస్తారా?

- కొమ్మూరికి సీనియర్ నాయకుల సవాల్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వద్ద రూ.3 కోట్లు తీసుకున్నట్లు ఆరోపణలు చేసిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా.. లేదంటే నువ్వు రాజకీయాల నుంచి తప్పుకుంటావా అని మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ సవాల్ విసిరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డి స్వగృహంలో టీపీసీసీ కార్యదర్శి కంచె రాములు, సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. డబ్బులు తీసుకోలేదని తడిబట్టలతో ప్రమాణం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. కలిసి పని చేయాలనుకుంటే సీనియర్లను కలుపుకుని పోవాలన్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు సిద్ధం..

జనగామ నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించే విధంగా కుట్రపూరితమైన విధానాలను అవలంభిస్తున్నారని, అందుకు సిద్ధమంటే తాము కూడా సిద్ధంగా ఉంటామని టీపీసీసీ కార్యదర్శి కంచె రాములు అన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలను తీసుకున్న నాటి నుంచి వర్గపోరు పెరిగిందని, ప్రశాంతంగా ఉన్న జనగామలో కొమ్మూరి ఫ్యాక్షన్ రాజకీయాలను తీసుకురావాలని చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుని, ఆ తర్వాత కలిసి ఉండే సంస్కృతి ఇక్కడ ఉందన్నారు. బీసీలపై కొమ్మూరి కక్ష గట్టారని, అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తమపై చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. నాయకులు సర్వల నర్సింగారావు, దూడల సిద్ధశయ్యగౌడ్, గంగరబోయిన మల్లేశం, రామగల్ల విజయ్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, గుండా శ్రీధర్‌రెడ్డి, కొత్త కరుణాకర్‌రెడ్డి, దాసరి శేఖర్, మధు, జాయ మల్లేశం, లింగాల రాజేందర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, చిర్ర హన్మంతారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడేది సీపీఎం ఒక్కటే

రఘునాథపల్లి: ప్రజాసమస్యలపై పోరాడేది సీపీఎం ఒక్కటే అని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ గ్రామంలో శనివారం సీపీఎం గ్రామ మహాసభ భీమగోని చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు చంద్రయ్య ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. కార్యదర్శిగా సాగ యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, పొదల నాగరాజు, మహేందర్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట

దేవరుప్పుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగార రమేశ్ అన్నారు. మండలంలోని పెద్దమడూరు గ్రామంలో సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సభకు మునుగొండ రేణుక అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇంటి వెంకటరెడ్డి, చెరిపెల్లి ఉమా రాణి, గనుపా సత్తమ్మ, బి అనిత, అల్వాల లక్ష్మి, జి లక్ష్మి, ఎం ముత్యాలు, రేణుక, వేల్పుల ప్రవళిక తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్దమడూరు గ్రామ శాఖ కార్యదర్శిగా ఐలాపురం నరసమ్మను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కృష్ణాజీగూడెంలో..

చిల్పూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో శుక్రవారం రాత్రి పార్టీ గ్రామ సభ మండల కమిటీ సభ్యుడు పోలు సంపత్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు కొండ యాకయ్య, మండల కార్యదర్శి సాదం రమేష్, గద్ద కుమార్, రామరాజు, ఊరడి మల్లయ్య, భిక్షపతి, రాజు పాల్గొన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శిగా పోలు సంపత్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సాదం శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

తాటికొండను పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సర్దార్ సర్వాయి పాపన్న నడయాడిన తాటికొండ గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించడంతో పాటు తాటికొండ నుంచి స్టేషన్ ఘన్‌పూర వరకు ఉన్న బీటీ రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరణ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని తాటికొండ గ్రామంలో సీపీఎం పార్టీ గ్రామ మహాసభ మండల కమిటీ సభ్యుడు సిద్దుల సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను రమేష్ ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యుడు యాకయ్య, మధు, రాజు, కనుకయ్య, బుచ్చయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు. అనంతరం తాటికొండ గ్రామ శాఖ కార్యదర్శిగా సిద్దుల సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షేమ పథకాలను విస్మరిస్తున్న కేంద్రం

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ శాఖ మహాసభల సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వెంకటేష్, రాజు, బాల్‌నారాయణ, రామగళ్ల అశోక్, ఎల్లయ్య, రాములు, రవి, కిష్టయ్య, బాలరాజు పాల్గొన్నారు.

జీడికల్ ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

లింగాలఘణపురం: జీడికల్ వీరాచల రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శనివారం అసిస్టెంట్ స్థపతి దామోదర్ ఆధ్వర్యంలో డీఈ కె.రాజేశ్వర్‌రావు, ఏఈ రాజయ్య, ఈఓ వంశీ సుమారు రూ.50 లక్షలతో ఆలయ ప్రాంగణంలో సాలారం, గ్రానైట్, క్యూ లైన్స్, సులభ్ కాంప్లెక్స్, ఇరవై గదులు, ఆలయం బయట సీసీ వంటి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు ఈఓ వంశీ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలను పరి ష్కరించాలని కోరుతూ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ప్రొఫెసర్ కోదండరామ్‌తో కలిసి టీఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఖలీల్, స్వీపర్ల సంఘం అధ్యక్షులు జి.గట్టన్న వినతి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

టిఫిన్ బాక్స్‌ల పంపిణీ

జనగామ: జనగామ మండలం పసరమడ్ల శివారులోని కోమటిరెడ్డి సుశీలమ్మ రుద్రమదే వృద్ధాశ్రమంలో దివంగత బుక్కా రవీందర్ జ్ఞాపకార్థం హోం అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో కుమారుడు భరద్వాజ్, కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. అనంతరం టిఫిన్ బాక్స్‌లను పంపిణీ చేశారు. డాక్టర్ రవి శంకర్, కె.శ్రీనివాస్, ఎం.బాల కృష్ణ, కె.అనిల్ తదితరులు ఉన్నారు.

రక్తదానం

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు లయన్ బైరు వెంకటేశ్వర్లు పుట్టినరోజు సందర్భంగా జనగామ మిలీనియం అధ్యక్షుడు గాదె నర్సింహులు అధ్యక్షతన జిల్లా ఏరియా ఆస్పత్రిలో పండ్ల పంపిణీ చేసి రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు, రెడ్ క్రాస్ మెంబర్, జనగామ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరు వెంకటేశ్వర్లు, మేడ పూర్ణ చందర్, రక్తదానం చేశారు. శ్రీరాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం

జనగామ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన రవీందర్ గౌడ్‌ను శనివారం డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. డాక్టర్లు మల్లికార్జున్, శ్యాం, భాస్కర్, ప్రభాకర్, జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు..

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన సన్మానించారు. ఈసందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రూ. 10 వేల నగదును పాఠశాల అభివృదికి హెచ్‌ఎం శోభన్‌బాబు అందజేశారు.

ఆర్థికసాయం

తరిగొప్పుల: మండల కేంద్రానికి చెందిన మృతులు సాంబారి రాధిక, స్పందనల కుటుంబ సభ్యులకు స్థానిక మాజీ ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి రూ. 5వేల సాయం అందజేశారు.

శునకాలతో జాగ్రత్త

చిల్పూరు: శునకాలతో ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు కుక్కలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్తంగా

పాఠశాలలో సీడ్ బాల్స్ తయారీ

లింగాలఘణపురం: నెల్లుట్ల ఉన్నత పాఠశాలలో శనివారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌ను తయారు చేశారు. వెంకటేశ్వర్లు, అనంత రాములు, శ్రీధర్, శివరామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి

జనగామ రూరల్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద విద్యార్థి మహా గర్జన నిర్వహిస్తుండగా రాష్ట్ర నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని, తక్షణమే కేసులు ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలో నిరసన చేపట్టారు. నాయకులు ఆర్య, రాజు, అఖిల, పల్లవి, రమేష్ పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

పాలకుర్తి టౌన్: అకారణంగా మహిళపై దాడి చేసి చితకబాదిన సంఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోతులబాదు గ్రామానికి చెందిన చిట్యాల నర్సమ్మపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడిచేశారు. అయితే బాధితురాలి కుమారుడు అదే గ్రామంలోని వేరే కులానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు, బంధువులు నర్సమ్మకు గొడవ జరిగింది. కోపోద్రిక్తులైన యువతి బంధువులు నర్సమ్మపై దాడి చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగాలఘణపురం: మండలంలోని కుందారం–పాలకుర్తి రోడ్డులో ఖాంసీగానికుంట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగారం గ్రామానికి చెందిన దొప్ప రాజుకు గాయాలయ్యాయి. నాగారం నుంచి పాలకుర్తికి వెళ్తున్న రాజును పాలకుర్తి నుంచి జనగామ వైపు వస్తున్న బస్సు ఢీకొట్టడంతో తలకు గాయాలై రక్తస్రావమైంది. జనగామ ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంజేపీ ప్రిన్సిపాల్‌కు..

జనగామ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఎంజేపీ ప్రిన్సిపాల్ అనితకు గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండలంలోని పెంబర్తి శివం ఫంక్షన్ హాల్ వద్ద చోటుచేసుకుంది. కళాశాలలో విధులు ముగించుకుని అనిత జనగామ పట్టణానికి స్కూటీపై వస్తుండగా ఎదురుగా మరో స్కూటీ వచ్చి ఢీకొనడంతో కిందపడింది. దీంతో కాలు, చేతికి తీవ్రంగా గాయలయ్యాయి. వెంటనే పట్టణంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

సీఎస్‌సీలో సేవలను మెరుగుపర్చాలి

బచ్చన్నపేట: సీఎస్‌సీ డిజిటల్ సేవలను మరింత మెరుగుపర్చాలని సీఎస్‌సీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. జ్యోతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించామని తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన రామ్మూర్తి

రఘునాథపల్లి: టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత రాపోలు రామ్మూర్తి హైదరాబాద్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు

చిల్పూరు: అధికారుల అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా అర్ధరాత్రి మట్టిని తరలిస్తే వారైనా చర్యలు తప్పవని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నష్కల్ గ్రామంలో శనివారం మట్టి అక్రమ తవ్వకాలు..రవాణా అరికట్టడంపై మైనింగ్ ఏడీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించగా తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ కల్వల శ్రీనివాస్, ఎంపీఓ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి స్నేహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ మాట్లాడుతూ గ్రామస్తులు తీర్మానం చేస్తే ఇతర గ్రామాల వారి మట్టి తరలింపు అనుమతులను రద్దు చేస్తామన్నారు. ఉపేందర్ యాదవ్, జంపయ్య, అరూరి శ్రీనివాస్, రాజిరెడ్డి, గట్టయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



కొడకండ్ల: అవగాహన కల్పిస్తున్న డీపీఓ స్వరూప



జనగామ: వైద్య శిబిరం ప్రారంభంలో రవీందర్‌గౌడ్

కొడకండ్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని డీపీఓ స్వరూప అన్నారు. నర్సింగాపురం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తడి పొడిచెత్త సేకరణపై మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాద్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఐకేపీ సీసీ సోమన్న, అంగన్‌వాడీ, ఆశాలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అనారోగ్య సమస్యలు లేకుండా అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు.

చిల్పూరు: గ్రామాల్లో స్వచ్ఛతపై ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన ఈడీ స్వరూపరాణి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ఐకేపీ మహిళా సంఘాల వారికి స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా తడిచెత్త–పొడి చెత్త కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఎంపీఓ మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించారు.

పురపాలికలో 'స్వచ్ఛతా హీ సేవ'

జనగామ: జనగామ పురపాలిక కార్యాలయంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ రవీందర్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కమిషనర్ వెంకటేశ్వర్లు శిబిరాన్ని ప్రారంభించారు. కార్మికులకు వివిధ రకాల టెస్ట్‌లు, ఆరోగ్య పరీక్షలు చేశారు. డీహెచ్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ అశోక్ కుమార్, డాక్టర్ కరుణాకర్‌రాజు, రాములు పాల్గొన్నారు.

పాలకుర్తి: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీఓ వసంత అన్నారు. మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌లో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొని గ్రామస్తులతో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు.

లింగాలఘణపురం: పరిసరాల పరిశుభ్రతలో మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ సీఈఓ సరిత అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిరిపురంలో మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఛాగల్లులో..

స్టేషన్‌ఘన్‌పూర్: తడి, పొడిచెత్తపై అవగాహన కలిగి ఉండాలని ఛాగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఛాగల్లులో తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

రఘునాథపల్లి: భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ కార్యదర్శి లవకుమార్ ఆధ్వర్యంలో షాహిద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. యాకన్న, రాథోడ్, ఆర్యవంశి, మహేష్, అక్షిత్ ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండీ.యూనుస్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనగామ రూరల్: న్యాయవాది సాధిక్ అలీ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అలాగే ఏబీవీపీ నాయకుడు చిలువేరు హర్షవర్ధన్ భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ భీంశర్మ

రఘునాథపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ సూచించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో శనివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలు కిరాణాదుకాణాలు, ఇళ్లు, బెల్ట్‌షాపులు తనిఖీ చేసి గుట్కాలు, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. జనగామ రూరల్, స్టేషన్‌ఘన్‌పూర్ సీఐలు ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వేణు, ఎస్సైలు నరేష్, శ్రవణ్, ఏఎస్సై రాజమౌళి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రఘునాథపల్లి: మాట్లాడుతున్న సౌజన్య

రఘునాథపల్లి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య అన్నారు. మండలంలోని శ్రీమన్నారాయణపురం 1–2, నిడిగొండ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వెర్వేరుగా పోషణ మాసోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్త హీనతనను నివారించేందుకు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు పోషకాలతో కూడిన పలు రకాల ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు గుమ్మడవెల్లి రమాదేవి, జయలక్ష్మి, వీరలక్ష్మి, ఏఎన్‌ఎం నిర్మల, అయాలు భారతి, అమృత, మంజుల పాల్గొన్నారు.

శిశువు మనుగడకు కృషి

దేవరుప్పుల: పుట్టిన ప్రతి శిశువు మనుగడ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు కృషి చేస్తాయని గండిపెల్లి రామతార అన్నారు. పడమటితండా(డి)లో శనివారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహిచారు. ఈ సదర్భంగా పౌష్టికాహారం, కౌమర బాలికల పరిరక్షణ, గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, శివుల అభ్యున్నతితోపాటు ప్రాథమిక విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

ఆడిట్ వివరాలు బయట పెట్టాలి

జనగామ: జనగామ మున్సిపల్‌లో మూడేళ్ల ఆడిట్ వివరాలను ఈ నెల 30న జరుగనున్న సర్వసభ్య సమావేశంలో బయటపెట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వ్యాసాలకు కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆడిట్ నివేదికపై అన్ని పార్టీల కౌన్సిలర్లు పట్టుబట్టాలన్నారు. ఆడిటింగ్ పూర్తయి ఏళ్లు గడిచిపోతున్నా ఇంకా రహస్యం ఎందుకన్నారు.

పేదల పక్షపాతి సీఎం

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని, వారి సంక్షేమార్థం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బసిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం అనారోగ్యంతో వెన్నుపూస సంబధిత వ్యాధితో బాధపడుతున్న పొన్నబోయిన ఇందు వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ. 1.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.

దాడులు అరికట్టడంలో ప్రభుత్వాల విఫలం



మాట్లాడుతున్న అహల్య

జనగామ రూరల్: రాష్ట్రం, దేశంలో రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. జనగామ పట్టణ ఐద్వా రెండో మహాసభ కొండ వరలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడారు. అనంతరం పట్టణ అధ్యక్షురాలుగా బండ రమాదేవి, కార్యదర్శిగా పందిళ్ల కల్యాణిలను ఎన్నుకున్నారు. సౌందర్య, మానస, కమల, బాలమణి, గౌస్య, నాగమణి, రేణుక పాల్గొన్నారు.

ఎనిమిది కాళ్ల గొర్రె పిల్ల జననం

- కొద్ది సేపటికే మృతి



మృతి చెందిన ఎనిమిది కాళ్ల గొర్రె పిల్ల

బచ్చన్నపేట : మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో రాగిపెల్లి బుచ్చయ్యకు చెందిన గొర్రెల మందలో శనివారం ఓ గొర్రెకు రెండు శరీరాలు, ఎనిమిది కాళ్లతో పిల్ల జన్మించింది. పుట్టిన గొర్రెపిల్లకు ఒక తల, రెండు శరీరాలు, ఎనమిది కాళ్లు ఉన్నాయని, జన్మించిన రెండు గంటల తరువాత మృతి చెందిందని బుచ్చయ్య చెప్పారు. ఈ వింత గొర్రె పిల్లలను చూడడానికి వచ్చిన గ్రామస్తులు.. ఇది కలికాలం.. బ్రహ్మంగారు చెప్పినట్లే జరుగుతున్నదని చర్చించుకోవడం కనిపించింది.